# విచిత్ర వ్యక్తి

కె. వి. సుబ్బారావు

౧

అదేమంటే దానికి సమాధాన మెవరమూ చెప్పలేము. మనుష్యప్రకృతిని గురించి ఇదమిత్థమని సిద్ధాంతీకరించి సూత్రీకరించుట ఎవనితరము? గుణవిశ్వ తెలుసుకోవడం, పోనీ అభ్యసించడమైనా సరే, ఎవనికిసాధ్యం? జన్మతః ముగ్గురమూ అందరికీ భిన్నముగాని జన్మపద్ధతి కలవాళ్లమే. ఎటువచ్చీ వాడు మా మేనత్తకడుపునా, నేనూ, నాచెల్లెలూ మాతల్లికడుపునా పుట్టి భూమిమీద పడ్డాము. పుట్టింది లగాయితు పెరగడంలోగానీ, అభిరుచులలోగానీ, వ్యావర్తులలో గానీ, అన్నిటిలోనూ వాడిత్రోవే వేఱయిపోయింది. పాఠశాలలో చదువుకునేటప్పుడు కూడా ముగ్గురమూ ఒకేతరహాగా ప్రవర్తిస్తున్నా, వాడితో సంబంధించిన విషయాలకు అదోవిధమైన ప్రత్యేకత ఉండేది. నాజూకుతనము, సున్నితపు నెఱనీటు, సుఖకరమైన చొక్కా, ఏదో అనిర్వాచ్యమైన ఉత్సాహమూ వాడిచుట్టూ ఆవరించిఉండేవి. వాడు మాట్లాడుతూఉంటే కించిన్మందహాససమ్మిశ్రితమైన చల్లదనాల వెల్లువల్ని ఒకజ్యోత్స్నమూర్తి ఒలికిస్తూ ఉన్నట్లుండేది. వాడికన్నుల్లో ప్రవిమలకాంతులు అంతరాత్మసందేశాలను అందిస్తూ ఉండేవి. చైతన్యపూరాలు వాడికో సంచరిస్తూ ఉన్నవాళ్లను కూడ ఆప్లావితుల్ని చేసేవి వాడికున్న ప్రత్యేకత, బారెడుచేతులున్నవనీ కాదు, మూరెడుముక్కున్నదనీ కాదు—అదేదో మసకబొమ్మల్లే వాడు మాలో ఉంటే మేమూ ఉన్నట్లుండేది: లేకపోతే మేమూ లేనట్లుండేది. వాడొక కళాస్వరూపమంటే జనులు నమ్మరు; పోనీ మా కళ్లాతో చూడన్నా ఒప్పుకోరు; మీరు మనుష్యప్రపంచకంలోని వాళ్లు కారంటారు.

వాడు లలితకళలన్నిటిలోనూ పిండిలో పండైనాడు. అతిబాల్యంలోకూడా వాడికంఠస్వరం, హృదయంలో లలిత తంత్రులంటూ ఉన్న ప్రతిప్రాణినీ ముగ్ధమోహన పారవశ్యంలో ముంచియెత్తింది. వాడు పాడమంటే పాడేవాడు కాడు. పాడితే వినేవాళ్లు విడవమంటే విడిచేవాళ్లు కారు. చిత్రలేఖనమూ అలాగే. చిన్నప్పటినుండీ ఏవోగీతలు గీస్తూఉండేవాడు. మాకు తెలీక అవి గీతలనుకునేవాళ్లం. చివరకు వాడే గమ్మత్తు చేస్తానని; ఆగీత అక్కడా, ఈగీత ఇక్కడా చెఱిపివేసేసరికి, తింటూతింటూఉన్న దానిమ్మపండు దిగజారి పడిపోగా క్రిందకు అడియాసతో చూస్తూఉన్న ఏచిలకో, విలాసంగా పూబాలల్లో మంచి మకరందం త్రాగి తూగుతూ వస్తూఉన్న మిళిందకుమారుణ్ణి, ఎగసి ముక్కుతో పట్టుకోడానికి మెడను ఱిక్కించుకొని చూస్తూఉన్న ఏగోరువంకో, గిరిశిఖరాన నిలిచి పడతాననే భయంలేక అందీఅందకున్న చెట్టుచిగురందుకునే ఏ పసిమేకగానో తయారయ్యేది. మేము విభ్రాంతితో అలాగే చూస్తూ నిలబడేవాళ్లం. పెద్దయింతర్వాత వాడు గొలికిన ప్రతిపదమూ అర్థవంతమైన కవిత్వంగా మారింది. వాడు గీసిన ప్రతిలేఖా సజీవమైన చిత్రకళగా కనిపించింది. వాడిమాటలకూ, వాడివ్రాతలకూ ఆట్టే భేదం మేము కనిపెట్టలేకపోయినాం.

అర్ధరాత్రివేళ లేచి— అందునా ముఖ్యంగా చీకటిరాత్రుల్లో—ఊరంతా మాటుమణిగి ఉన్నప్పుడు, 'చీమచిటుకని అన్నా శిక్షగల్గినా' అప్పుడు, జలజలమని గులకరాలతో పలుకులాడుకునే చిఱుకాల్వకంతెనపైన కూర్చుని, గంటలకొలదీ ఆలోచిస్తూ, ఏకాంతంగా ఉండటం చిన్నప్పటినుండీ వాడికి చాలావేడుక; వేడుక గాదు వాడుక. చీకటంటే వాడికి భయంలేదుగానీ దుర్మార్గుడనేమాట విని భయపడ్డాడని నేనెఱుగుదును. కొండలనుచూచి ఎక్కి తిరగడమంటే వాడికి సరదాయే కాని నేనొకసారి మనుచరిత్రంలో "గ్రుద్దుక్ గోత్రా చలంబుల్" అని చదివేసరికి త్రుళ్లిపడ్డాడు. అంతసున్ని

తపు మనస్సు కలవాణ్ణి నేనెక్కడా చూడలే. ఒకసారి బజారుకువెళ్లివస్తూ త్రోవలో కత్తికోతలవాడొకడు చేయికోసుకుని, గాయమునుండి రక్తం కారుతుంటే, దాన్ని నాకుతూ దానిమీద తుబుకుతుబుకుమని పట్టెడు పట్టెడు ఉమ్మేసుకుంటూ వస్తూఉన్న దృశ్యాన్ని చూచి గలబరించిన ఒంటితో గబగబ ఇంటికి పరిగెత్తుకొని వచ్చేసరికి, వినోదానికని ఇంటిముంగర గారడీవాళ్లు పోట్లాడించిన రెండుపొట్టేళ్ల తలలు పగిలి రక్తం ఘోరంగా ధారలై పడుతూన్న దృశ్యంకూడ చూచి మావాడు మళ్లీ మంచందిగేసరికి పన్నెండురోజులు పట్టింది.

వాణ్ణి మేము దేవతామూర్తిగానే తలపోసినాం. బుద్ధెఱిగినతరువాత మా శ్యామల ప్రేమలత లావైపుకు ప్రాకుతూఉండడం గ్రహించీ నేను మారుచెప్పడానికీ ప్రయత్నించలే. చెల్లెలని చెల్లెలుమాటలు కాకపోయినా, మా శ్యామల అందగత్తె అనే అందఱూ అనుకునేవాళ్లు. నాకేమీ తెలీదుసుమండీ. నేను మోటువాణ్ణి. మా రెండుకుటుంబాల్లో అభిప్రాయాలేకాక మాచేవాళ్లు కూడ వీళ్లిద్దరూ ఒకరికొకరు తగినవాళ్లనీ, సంసారం చాలాసౌమ్యంగాను సుఖకరంగాను ఉంటుందనీ అనుకున్నారు. పెద్దవాళ్లమాటకు వ్యతిరేకంగా చెప్పలేకో, లేక మా శ్యామలపై ప్రేమచేతో వాడుకూడా మాటాడలే. నాకూ అతనిలో క్రొత్తమార్పేమీ కనపడలే. వివాహం సలక్షణంగానే ఐంది. అంతా సవ్యంగానే ఉంటుందనుకున్నాం.

వివాహమైన రెండుసంవత్సరాలవరకూ విశేషాలేవీ లేవు. వాడేవో బొమ్మలూ, పద్యాలూ భారతి మొదలైన పత్రికలకు పంపిస్తూ ఉండేవాడు. సజీవమైన చిత్రకళ. ఎవరాదరించరూ? ఇతనిబొమ్మలు చూచీ, వ్యాసాలు చదివీ, ఆనందించి ఇతనిరూపాన్ని చూద్దామని వచ్చే కళోపాసకులను, చాలామందిని నేనెఱుగుదును. వాడు ప్రపంచకానికి ఆదర్శాలని ఎన్నో అందిస్తాడనీ, అన్నివిషయాల్లోనూ ఆకుమఱుగున పిందెలాగా ఉంటాడనీ అందఱమూ వివృతహృదయాలతో ఎదురుచూస్తున్నాం.

## ౨

మావేణూకూ-అసలు వాడిపేరు వేణుగోపాలం. మాఅమ్మను కన్న తాతగారిపేరుకూడా గోపాలరావుగారు కావడంచేత మాఅమ్మమ్మ వాడి నాపేరున పిలవడానికి వీలులేక వేణూ అని పిలుచుకునేది. మాకూ‌క్కడా అదే అలవాటైపోయింది అందుకని వాణ్ణి ఆపేరనే తఱచు వ్యవహరిస్తూ ఉండేవాళ్లం—నాకూ మావూళ్లో చదువైపోయింది. B. A. పూర్తిచేశాము. నాకింకా చదువుకోవాలని ఉంది వాడికీ చదువుమీద, విద్యార్థిజీవితంమీదా అపేక్ష తగ్గకపోవటంచేతనూ, ఇంకా తన అభిరుచులకూ, అనుభవాలకూ, అభివృద్ధికీ, అనుకూలమైన ప్రదేశం ఇది కాదనిన్నీ, నెమ్మదిగా చెన్నపురి చేరుకుంటే అక్కడ తన ఆశయాలకీ, జీవితక్రమానికీ తగినవాళ్లుంటారనీ, నేను కూడ అక్కడ M. A. చదువుకుంటూ ఉంటే ఇద్దఱమూ సుఖంగా కాలం గడుపవచ్చుననీ తన అభిప్రాయం వెల్లడించి నాతో సంప్రతించాడు. ఇద్దఱమూ వెళ్లి నాన్నగారిని చూద్దామనుకున్నాము.

వాలుడుకుర్చీలో జేరగిలబడి సోలినట్లు మా నాన్న కూర్చునిఉన్నారు. మాఅమ్మ ప్రక్కనే కాఫీ కప్పూ, సాసరూ పట్టుకుని నిల్చిఉన్నది. కిటికిలోనించి హాయిగా గాలిపిల్లలు పరుగెత్తుకుని ఈదుకొని వస్తూ ఉన్నారు; ప్రక్కనేఉన్న మాశ్యామల ముద్దుమొగాన మూగిన ముంగురులు ఒక్కసారి ఊగించి వెళ్తున్నారు కూడాను. కిటికిలోనించి దూరంగా కనబడుతున్న తాటితోపులూ, అందులో ఒకచెట్టుపైకి తొండలా ప్రాకుతూఉన్న ఈడిగవాడూ, వాడికత్తులూ, అన్నీ ఊహాచిత్రాల్లోమల్లే కండ్లకు కట్టుతున్నాయి. అప్పుడే ఎక్కడనుంచో ఒకచిన్న గడ్డిపరకను నోట గఱుచుకొనివచ్చి మాకిటికీకమ్మలమీద వ్రాలి నిలబడిన ఒక పిచ్చుక కీచుకీచుమంటూఉన్నది మాకొంచెపు కిటికీలోనుంచీ అతిభూమమైన ప్రకృతిచిత్రాలన్నీ కనులకు కట్టినట్లు గోచరిస్తున్నాయి. మేము తటాలున లోపలికివెళ్లేసరికి అట్టే తెగి మాశ్యామల మెఱుపువలే మాయమైంది

వేణూను చూచి. అదేమో దర్శనమాత్రాన్నే మెలగి పోతాయికాబోలు పరస్పర హృదయాల్లో ప్రణయ తంత్రులు. మాశ్యామలముగ్ధభావానికి నేనే ముగ్ధుణ్ణయి పోయాను.

"రండి! రండి! కూర్చోండి! సమయానికే వచ్చారు. అమ్మాయ్, మరిరెండు కప్పులతో కాఫీ పట్టుకురా తల్లీ!" అన్నారు నాన్నగారు.

మే మిద్దరమూ చెరొక కుర్చీమీదా కూర్చున్నాము.

"వేణూ! ఏమిటోయ్! మొన్న బెజవాడ Exhibition లో నీబొమ్మకు ప్రథమ బహుమానం ఇచ్చారట కామా? మొన్న నీవు వ్రాసిన "మనోహరి" అనే కావ్యానిక్కేగమా కావ్యపరీక్షలో మొదటిబహుమతీ ఇచ్చారట. ఒక్కసారైనా చెప్పేవేకాదు. నిండుకుండ తొణకదని, అలాగే నిలబడ్డావేం! నీవన్నా వెళ్లి రెండు కప్పులు కాఫీ పట్టుకురాక" అన్నారు నాన్నగారు అమ్మనుచూచి.

"కాస్తసేపు కూర్చుంటే అల్లుడు అరిగిపోతాడు కాబోలునేమండీ. రాకరాక ఎప్పుడో వాడు తటుక్కు మనటం, మీరు మీకబుర్లతో వాణ్ణి అలాగే పంపెయ్యడం! అబ్బాయి! నువ్వూ బావా కలిసి లోపలికి రండేం కాఫీ ఇస్తాను."

"ఇదిగో" అని నాన్నగారంటున్నా వినిపించుకోకుండానే అమ్మ లోపలికి వెళ్లిపోయింది.

"ఆడవాళ్ల చాదస్తమంటే యిదే" నన్నారు నాన్నగారు.

* * * * *

ఆరోజుకు వేణూకూడా మాయింట్లోనే ఉండిపోయాడు. భోజనాలదగ్గఱకూడా అవేకబుర్లు—అంటే వాడిబొమ్మలూ, వాడిపద్యాలూ, వాడివ్యాసాలూన్నూ- భోజనాలవుతూ ఉండగానే ఏదోమాటల సందడిని నాన్నగారు.

"అవును. ఇక్కడ చదువు పూర్తిఅయిందికదా! వేణూ! ఇంకా ఏమిచేద్దామని నీ ఆలోచన? పోస్టుగ్రాడ్యుయేటు కోర్సు చదవాలని ఉందా? నాన్న యేమన్నాడు? అసలాయన్ని కదిపేవా యీసంగతి గురించి" అన్నారు.

"అనుకుంటూన్నమాటనే అడిగారు. ఎలాగా ఈవిషయాన్ని బయటపెడదామా అని బావా, నేనూ ప్రొద్దున్నుంచీ చాలా గుంజాటన పడి ఏమీతోచక ఇందాకటినుంచీ మూకీభావంతో ఉన్నాము. బావకు కూడా M. A. చదవాలని ఉందిట. నాకైనా ఇక్కడ ఉన్నకార్యంలేదు. ఉన్నతసంస్థలకీ, అభివృద్ధికరమైన త్రోవలకీ ఆస్థానమైనది చెన్నపట్టణము. అక్కడఉండి, అక్కడి నాగరికకళాజీవితంలోకూడ కొంతరుచి మూడవలెనని ఉంది. పేర్లువినడం, బొమ్మలు చూడడం వాళ్లనుగుఱించి చదవడమేకాని మహాపురుషులతో సాంగత్యసుఖం, వారి వ్యక్తిగతాంతర్జీవితాల్లో బహిర్గోచరంగాని సారస్యం, ఈనాలుగుమైళ్ల ప్రపంచకంలోనే ఉండి అనుభవించడమెవడివశమూ కాదుగనుక, కళాస్వరూపాన్ని అభ్యసించడానికీ, మహాపురుషులతో పరిచయంకలగచేసుకోడానికీ నేను కూడా చెన్నపట్టణం వెళ్దామనుకుంటున్నాను. నాన్నగారితో యీసంగతి ముచ్చటిస్తే, ఇప్పటికే వారు నాకొఱకు చాలా డబ్బు తగలేశామనీ, తెచ్చే దేమీలేకపోయినా తగలబెట్టడంమాత్రం నాకు బాగా చేతౌననీ చీవాట్లుపెట్టేరు."

"వేణూ! అదేమిరా! అన్నయ్యే అలాఅంటా?" అన్నది అమ్మ.

"ఆ! పదేండ్లు పట్టణవాసంచేసి నాగరికవిజ్ఞానాన్నీ, మాటమర్యాదనూ బాగ గుర్తెఱిగేనని అనుకుంటున్న మీఅన్నయ్య అన్నమాటే యిది. పదేండ్లు కాదు వెయ్యేండ్లు పట్టణవాసంచేసినా, మీఅన్నయ్యే కాదు. అన్నయ్య ఇంట్లో వాసాన్నికూడా "పీనాసీ! పలుకూ" అంటే పలుకుతుంది." అన్నారు నాన్నగారు.

"పోనీలేండి! మావాళ్లంతా పీనాసులు! మీరే మహామహామహామహా తెసుబాటు కలవాళ్లైతే! ఏకీ చూతాం, పిల్లల్నిద్దటినీ, ముచ్చటపడుతున్నారుగా, పట్టణం పంపిస్తామని అనండీ; చదువుచెప్పిస్తామనండీ! అనరేం?"

"అన్నా అనకపోయినా వెయ్యిపుటాలు వేసినా మా తెసుబాటుగుణం మీపుట్టినింటివాళ్లకు జన్మజన్మేకీ రాదు."

"పోనీలేండి! మీరు కాశీనాథుని నాగేశ్వ రావుపంతులుగారంతటివాళ్లు; సి. అర్. దాసంతటి వాళ్లు. మళ్లీమాట్లాడితే కర్ణుడంతటివాళ్లు. మీతండ్రి గారు బలిచక్రవర్తి అంతటివారు. మీతాతగారు శిబిచక్ర వర్తి అంతటివారు. ఇంకా ఇంకా మీవాళ్లంతా ఇంత వాళ్లంతవాళ్లు; కొండలంతవాళ్లు; గోసెలంతవాళ్లు సరేనా!" అన్నది మాఅమ్మ.

ఈవినోదకలహాన్ని వింటూనే నేనూ, వేణూ ఆరగిస్తున్నాము.

"ఎంత ఉడుకుమోత్తనమో, అన్నలనీ, అమ్మ లనీ అంటే ఆడవాళ్లకి. ఈగవాలనీయరు వాళ్ల యిండ్ల మీద" అన్నారు నాన్నగారు.

"ఇంత చదివారుగాని మీయిద్దైనాగాని పిల్లల్ని పంపిస్తామనే మాటమాత్రం అనలేదు. ఇందులోనే తెలుస్తున్నది మీ తెసుబాటుతనం యావత్తున్నూ" అన్నది అమ్మ.

"ఓసిపోవే."

భోజనాలు ముగించుకుని సావిట్లోకివచ్చి కూర్చు న్నాం. శ్యామల అదివరకే పేపళ్లెంలో వక్కపొడీ, తునికవటాకులూ, సున్నం తెచ్చి చిలకలుగా చుట్టిపెట్టి వెళ్లిపోయింది. వాలుడుకుర్చీల్లో కూర్చుని వాటిని నమ లుతూ హాయిగా ప్రసంగించుకొంటున్నాం. నన్నూ, మాబావనీ చెన్నపట్నం పంపడానికి చివర కేలాగైతేనేం నిశ్చయించారు. వేణూ, నేనూ నాలుగుగంటలకి టెన్నిస్ ఆడుకోడానికి వెళ్లేం. మళ్లీ తిరిగివచ్చేటప్పుడు వేణూ

"బావా! అయితే వెళ్లడం నిశ్చయమన్న మాటేనా?" అన్నాడు.

"కాకేమీ? ఇవ్వాళ మే ౧౦. ఎటుపోయి ఎటువస్తుందో అని ఆలోచించే ప్రెసిడెన్సీకాలేజీలో M. A లో seat తెప్పించుకొని ఆట్టిపెట్టుకున్నాను. నీవు School of Arts and crafts కు seat కోసం వ్రాయి. దానికి కొంచెం ఆలస్యమయినా ఫర్వాలే దనుకుంటాను అసలు నీపేరు వింటేనే చాలదుటోయ్."

## 3

ఆమర్నాడే వేణూకూడా ఎగ్మోరుకు ఉత్తరం వ్రాశాడు School of Arts and crafts లో తన్ను చేర్చుకోవలసినదిగా. ఇంకో మూడురోజులకు ఆప్రిన్సి పాలుదగ్గఱనుండి, మావాడు తమస్కూల్లో ఉపాధ్యా యుడుగా ఉండతగినవాడే కాని, విద్యార్థిగా ఉండ తగినవాడుకాడనీ, ఐననూ క్రమశిక్షు అలవాటుపడ టానికి కొన్నాళ్లు కళాశాలలో విద్యార్థిగా ఉండడమే మంచిదికనుక వేణూను తనవద్ద విద్యార్థిగా ఉంచు కోవడం తన కెంతో సంతోషమనీ, వేణూ అంతటి వాడు తమకళాశాలకు రావడమే తమకొక ఘనత అనీ, ఇలాంటివగైరాలతో కొంతపొడుగున ఉత్తరం ఒకటి వ్రాశాడు. జూన్ నెలాఖరున కాలేజీ తెరిచారనగానే మేమిద్దఱు మూటాముల్లే కట్టుకొని వెళ్లి వాడికీ నాకూ సదుపాయంగా ఉండేటట్లుగా నాగప్పవీథిలో ఒకమేడ మీదగది ౧౦ రూలకు అద్దెకుపుచ్చుకొని మా చెన్న పట్టణ జీవితాన్ని ప్రారంభించాము.

మావాడుకూడా School of Arts లో జేరి అక్కడఉండే విద్యార్థులకందటికీ తానే ప్రాథమికశిక్షు నేర్పుతూ, అక్కడ గొప్పగొప్ప పేరెన్నికగన్న చిత్ర కారుల్ని దర్శించుకుంటూ, మహాపురుషులతో చెలిమికలుగ జేసుకొంటూ, అందఱకూ తల్లోనాలుకలాగ మెలు గుతూఉండేవాడు నాచదువు పరీక్షులచదువు; వాడిది విశ్వమానవ జీవితకళారహస్యవిద్యావిధానం. నాకు చదవ వలసిన పుస్తకాలెక్కువగా ఉండటంచేతా—చదవక పోతే పరీక్షుతప్పుతాననే భయంచేతకూడా—స్వాయం

కాలం బీచికి షికారుకువెళ్లిన ఏ రెండుమూడుగంటలో, లేక సినీమాకువెళ్లిన యేరెండుమూడుగంటలలోతప్ప, నిద్రాహారాలకు వ్యయించిన సేపు మినహా తక్కినకాల మంతా నాచదువుకే వినియోగించినవాడ నవడంచేత వాడి అభిరుచులలోని, వాడి అనుభవంలోని ఆనందం కొంచెం కూడా నేను పొందలేకపోయాను. వాడిది ఏపుస్తకంలోనూ వ్రాయని విద్య అవడంచేతా, అంతు లేని విద్యఅవడంచేతా, వాడికి కూడా నాతో అట్టే కలిసిమెలిసి ఉండడానికి తీరుబడి అయ్యేదికాదు. ఈ విధంగా మాయిద్దఱిస్వభావాలూ రెండుదారులు త్రొక్కినయ్.

మేము పుచ్చుకొన్న ఇంట్లోనే రెండుగదు లున్నవి. ఒకటి నేను, యింకొకటి వాడూ వాడుకుంటూ ఉండేవాళ్లం. మనోహరదృశ్యాల్తో నిండిన చిత్రాలూ, చుట్టూ నిలువుటద్దాలూ, రకరకాలైన Glass Painting లూ, ఒక్కొక్క అద్దంపైన ఇంపైనపద్యాలూ, పచ్చని పూలమొక్కలూ, పూచిన గులాబీమొక్కలున్న తొట్లూ, ఎన్నో జాతులచిత్రమైనగవ్వలూ, రాతి పువ్వులూ, తనకు మంచివని తోచిన యిలాంటి అన్నింటినీ తెచ్చి తనగదినిండా వాడు అలంకరించుకునేవాడు. ఎప్పుడూ తెల్లని జిలుగులు కట్టుకుని, రబ్బరు జోళ్లు వేసుకొని దేవతామూర్తిలాగా వర్తిస్తూ ఉండేవాడు.

మఱి ఇంతవ్రాశావు, ఏమిచేశాడయ్యా మీవాడని మీరడిగితే నే నేమీచెప్పలేను.

వాడిని పిచ్చివాడని మీరంటారుగాక, నేను మాత్రం ఒప్పుకోను. ఒకవిధంగా చూస్తే వాడు నిజంగా పిచ్చివాడే— అందఱిసృష్టిలోనూ— తమతమ వ్యవహారాలను తాము నిర్వర్తించుకొంటూఉన్న వ్యక్తులను, తనకు పనిలేదనిచేరవచ్చి, ఎవడోఒకడు, అనవసరంగా వారివారి నడవళ్లలో మంచిచెడ్డలను గ్రహించి, వారి వారి జీవితాల్ని కెలకడానికి వచ్చాడంటే ఎవడు సహించగలడు చెప్పండి? పైకి ఆడంబరజీవితాల్ని చెలామణిచేసుకుంటూ లోపల లొటారపు పెద్ద మనుష్యు లెందఱులేరు, కొంచెం ఎంచిచూడండి. వారందఱినీ తమలోపాయికారీగుట్టుల్ని పైకి లాగుతానని మావాడిలాంటివాడు అభ్యర్థిస్తూవస్తే పోనీ పైకి లాగి లోకం మొగాన పారవేయకుండా తనమనసులోనే ఉంచుకుంటానని మాటఇచ్చినా—ఇతరులకు తనరహస్యాలు తెలీనిచ్చేవాళ్ళకిక దెవడుంటాడు ఆలోచించండి. అట్టిమనస్సాన్యకార్యానికి దిగినవాడు వెఱ్ఱివాడా, వెఱ్ఱి న్నరవాడా?

కాని మా వాణ్ణి మాత్రం పండిపోయిన లౌకికుడైనా సరే, ఎవ్వడూ ఇలాగని అనుమానించ లేదు. వాడినిచూచి వాడితో చెలిమిచేసినవారందఱూ తమరహస్యాలు దాచిపెట్టుకోదగిన పెట్టెగదా వీడి హృదయం అనే అనుకున్నారనుకుంటాను;—ఇంకో విధమైన అపప్రథ ఏదీ వీడికి చుట్టుకోలేదుకనక— అంతటి దుర్లభమైన కార్యంలోకూడా జయశాలి ఐనాడు కనకనే వెఱ్ఱివాడని లోకం వాణ్ణి దూషించినా నేను ఒప్పుకోను.

౪

సంపర్కాలన్నీ యిలా ఉంటూఉండగా, హఠాత్తుగా మేము కాపురమున్న ఇంట్లో ఒకముసిలావిడ చతుర్థినిష్ఠాపంచకాల్లో కాలగోచరమైంది. అందుచేత ఆయిల్లు ఆఱునెలలు పాడుపెట్టాలిసి వచ్చింది. మే మిక అక్కడ ఉండడానికి వీలులేకపోయింది. అందులో అలాంటివంటే మావాడికి ఇంతింతనరాని అసహ్యం కని మొదటనే మనవిచేసుకొని ఉన్నాను. కాని ముసిలావిడచావు మాకు ముప్పుతిప్పలుతెచ్చిపెట్టింది. హఠాత్తుగా చెన్నపట్టణంలాంటి ఊళ్లో క్రొత్తబసలు దొరకాలంటే సాధ్యమవుతుందా? ఎంతగా విచారించినా మాయిద్దఱికీ సరిపడ్డగది ఒక్కటీ దొరకలేదు. ఆరోజు నేనూ వాడూ కూడ సెలవుపెట్టి బసకోసం తిరిగేము. మాకాళ్ల శని వదలిందేకాని, అదేమి పాపమో, నాకూ వాడికీ సరిపోయిన జాగా ఒక్కటీ అగుపడలేదు. Bells street లో ఉంది ఒకగది. ఒక్కడికే సరిపోతుంది. స్నానపానాదులకు కొంచెం ఇబ్బందిగా ఉన్నా ఒక్కడెలాగైనా జరుపుకోవచ్చు. కాని రెండో

వాడు వచ్చాడంటే కూర్చొడానికైనా స్థలం చాల దాగదిలో. తిరిగితిరిగి విసుగొచ్చి ఆగదిలోనే కూలబడి ఇద్దఱమూ—ఎలాగా — అని ఆలోచిస్తూఉన్నసమయాన్ని, ఆయింటికే Egmore లో సుప్రసిద్ధ వర్తకుడైన లాల్ గారున్నూ, వేణూ ప్రిన్సిపాలున్నూ కలిసివచ్చారు. వారింకా లోపలికి పోకముందే మమ్మల్ని చూచి ఆగి,

"హల్లో! మిస్టర్ వేణూ! నీవుకూడ ఇక్కడే ఉన్నావే. ఏగాలికి కొట్టుకొచ్చావిటూ? Nagappa వీథిలో అని చెప్పేవాడిదికనూ మామకాం. ఇక్కడున్నావేం? ఏమిటి సంగతి" అన్నాడు ఆయన, అంటే ప్రిన్సిపాలుగారు.

"మేమున్న ఇంట్లో ఒకవృద్ధురాలు, పాపము, కాలగతి కన్నది. నక్షత్రం మంచిదికాదట. ఇల్లు ఆఱు నెలలు పాడుపెట్టవలెనట. మేము అద్దెఇండ్ల వేటకు బయలుదేఱి, ఎక్కడా ఒకటీ దొరక్కపోతే ఇక్కడ కూలబడినా మీలాగా. మీ రిటు దయచేశారేం?" అన్నాడు వేణు.

"ఎబ్బే; ఏమీ లేదూ—లాల్ గారూ, ఇతన్ని ఎఱుగ రనుకుంటాను. ఇతనే కె. వేణుగోపాలరావంటేను. మానూళ్లో క్రొత్తగా మీకు చూపదగిన భవ్యాలంకారము. ఇదివరకు మా విద్యార్థులేవో ఊహాచిత్రాలు వ్రాస్తేనే వాటిని చూచి మీరు చాలా మెచ్చుకునేవారు. అట్టి ఊహాలన్నీ సజీవంగా మూర్తీభవించిన దివ్యమూర్తి ఇతను. మీ మన్ననకు మిక్కిలి తగినవాడు. వేణూ! వీరి నెరుగుదువా? వీరే లాల్ గారంటేను. మనకళాశాలాభివృద్ధికై పలువిధాల సహాయపడుతూ, అక్కరలకు ఆదుకుంటూ, మనకు జీవగఱ్ఱవలె ఉన్న మహనీయులు. వీరు నీకెంతయూ పూజ్యులు—"

అని ఇలా వాళ్లిద్దఱికీ జోస్తీ కలిపేడు. లాల్ గారు అభివాదనపూర్వకంగా తన చేతిని ముందుకు చాచారు. వేణూ దానిని చేకొన్నాడు.

"మహాశయులకు వందనములు—మీమన్ననకై వేచియున్న నన్ను ధన్యుని చేయుదురుగాక" అన్నాడు.

"నాయనా! ఈతడెవరు?"

"మా బావ! Presidency College లో చదువుకొంటున్నాడు. మేమిద్దఱమూ కలిసేఉన్నాం."

"అయితే మీరింక యీ వేట చాలించి కొంచెం విశ్రమించండి. బస దొరకలేదని ఏమీ బెంగపడవద్దు. ఎగ్మోరులో హాయిగా యిద్దఱూ మాయింట్లోనే ఉందురుగాని రండి! మీకు తగిన సౌకర్యాలన్నీ చేస్తాను. మీలాంటి పిల్లలను ప్రోత్సహించకపోతే చెన్నపట్టణానికే చెల్లని అవమానం" అన్నారు లాలుగారు.

"మీ అభిమానమున కెంతయు కృతజ్ఞులము. కాని మాకు కాలేజీకి దూరంగా ఉంటుంది ఎగ్మోరంటేను. అదీగాక చాలామంది మేమెరిగిన స్నేహితులిక్కడే ఉన్నారు. వారిని విడిచిపెట్టి రావడానికి కొంచెం ఇదిగా ఉంటుంది; క్షమించి—" అన్నాను.

"ఇదీ లేదు, అదీ లేదు, ఎక్కడఉంటే అక్కడే స్నేహితులు కూడుతారు ఇంతకూ మీకు స్నేహితులు కానివాళ్లెవరూ? మీమంచితనమే అందఱినీ మీకు స్నేహితులుగా చేస్తుంది" అన్నారు లాలుగారు.

నాకు అనవసరమైన అభిమానఋణంలో పడిపోతామేమో అని చాలా భయం వేస్తున్నది. లాల్ గారికి మా అభిమానదురభిమానాలవల్ల లాభనష్టాలు లేకపోయినా మామనస్సు కొట్టుకోక తీరదుగా మఱి.

'ఇదిగో ఇంకా ఏమిటి ఆలోచిస్తున్నారు. మీరు చిన్నపిల్లలు. మీకు తెలీదు. నన్నెవరడగమన్నారు చెప్పండి మిమ్మల్ని—మీమంచితనమే, మీ సరళస్వభావమే, మీ విమలహృదయాలే నావాత్సల్యాన్నింతగా ప్రేరేపిస్తున్నవి. మీకేమీ సంకోచం వద్దు రండి!" అన్నాడు లాల్.

"అలాచేస్తే మాత్రం మీకేం కష్టముంది లాల్ గారిల్లు చాలావిశాలమైనదే. వారిని గుఱించి మీకింకా తెలీదు మీకేకాదు, చాలామందికి వారి ఉదారహృదయంలో చోటుంది వారికేమైనా ఇబ్బందిగా ఉంటుందేమో అని ఆలోచిస్తున్నారేమో? మీతో ఇంకో

ఇద్దర్ని తెచ్చుకున్నా వారికి ఆశ్రయా న్నివ్వడానికి ఏమీ అభ్యంతరం ఉండదు." అన్నాడు ప్రిన్సిపాలు. ఇద్దరూ మామొగాలవంక చూస్తున్నారు. అమితమైన భయం ఒక్కసారిగా మీదబడితే ఎలా స్తంభిస్తుందో, అమితమైన దయారసం వచ్చి ముంచేసినా అలాగే హృదయం ఉక్కిరి బిక్కిరి అవుతుంది. మాకేమీ చెప్పడానికి తోచలేదు. అసలు నాకు వెళ్లడానికి ఇష్టంలేదు. కాని గట్టిగా చెప్పలే నామాట. చివరకి

"మీ ఇష్టప్రకారమే కానీయండి. నేనిక్కడ ఉండిపోతాను. వేణూ మీయింట్లో ఉంటాడు. నాకూ ఏమీ అభ్యంతరం లేదుకానీ అదేదో యీప్రాంతాలన్నీ నన్ను మచ్చికపఱచుకొన్నవి. వాటిని రోజూ చూడకపోతే కొంచెం కలతగా ఉంటుంది హృదయంలో." అన్నాను. వేణూ నావంక తేరిపారచూశాడు, అలాగన్నా వేమన్నట్లు.

"సరే! అతనికి ఇష్టంలేనట్లున్నది. వేణూ! నీవైనాసరే! బలవంత మేమీ లేదు సుమా! ఇంటికోసం దేవులాడుకొంటున్నారు కనక ఎందుకు ఇబ్బందిపడతారని అన్నానంతే" అన్నాడు లాల్.

"నీకు స్కూలుకు దగ్గఱకూడానోయ్! పోనీ మీబావ నిక్కడే ఉండనీ! నీవురా! కావలసినప్పుడు వచ్చి చూచిపోదువుగాని. కొన్నాళ్లు ఒంటరిగా ఉంటే ఒంటరితనంలో సౌఖ్యంకూడా మీబావకు తెలుస్తుంది." అన్నాడు ప్రిన్సిపాలుగారు.

ఈతడవకూడా ఏమన్నా అడ్డుమాట చెప్పితే మర్యాదగా ఉండదనో, ఇల్లు దొరకని శ్రమచేతనో, కాక ఈబాధ చప్పున వదుల్చుకొందామనే అభిప్రాయం చొప్పునో

"చిత్తం! అలాగేనండి" అన్నాడు వేణు.

"అయితే, రేపుశనివారం, మీకు కాలేజీ ఉండదుకనుక, కారును పంపిస్తాను. మీరందులో మీసామానులను తెచ్చుకోవచ్చును. మీకోసం ఎదురుచూస్తూ ఉంటా" నని చెప్పి లాలూ, ప్రిన్సిపాలూ లోపలికి వెళ్లిపోయారు.

అన్నాడే గాని ఈయన కీసంగతి జ్ఞాపకముండి చస్తుందా అనుకున్నాం. తర్వాత ఇంకోఇల్లేదైనా చూసుకోవచ్చుననీ ఇంటివాడు తొందరపెట్టుతూ ఉన్నందున అప్పటికి మాత్రం సామానైనా క్రొత్తగదిలోకి చేర్చుకుందామనీ, మర్నాడు ప్రొద్దునపూట సర్దుకుంటూ ఉండగా, పది గంటలవేళకు వీథిలో మోటారుహారన్ చప్పుడైంది. నాకు గుండెల్లో గుబులువేసింది. కాని మాటమర్యాద పోతుందనే భయంచేత, నాసామాను మాత్రం క్రొత్త గదిలో బెట్టించుకొని, పద్దంటూన్నా వేణూను "ఏదో మాటవరసకు గదితీసుకున్నాను గాని ఎప్పుడూ నీదగ్గరే ఉంటా" నని నచ్చచెప్పి వాణ్ణి లాల్ గారి-టికి పంపించాను. వాడు వెళ్లేవరకూ లేదుగాని, దృష్టిపథందాటి వాడు లేడని తెలిసేసరికి, మనసు బరువుగా ఉన్నదనిపించి, అదేదో విధమైన గుబులు మనసులో ప్రవేశించింది.

౫

మా లెక్చరర్లకు నేనంటే చాలా ప్రేమగా ఉండేది. రేపటికి చెప్పవలసిన పాఠాలు అన్నీ యీరోజునసే చదువుకొని వెళ్తూ ఉండేవాడిని. అందుబాటులో ఉన్న ప్రతివార్తాపత్రికా, పుస్తకమూ చదివి విషయాన్ని అవగాహనకు వీలయ్యేటట్టు టూకీగా నోట్సు వ్రాసుకొని రిఫరెన్సుకు అట్టిపెట్టుకొని, సాధ్యమైనంతవరకు ఆధునికవిజ్ఞానాన్ని ఎఱుకలో ఉంచుకునేవాణ్ణి. లెక్చరర్లు వృత్త్యనుసారంగా ఎన్నేండ్లు పాడినా అదేపాటగనుక క్రొత్తవిషయాలతో ఆట్టే జోక్యం కలుగచేసికోరు. ఎలాగైనా వాళ్లను చెప్పలేదనీ, క్రొత్తవి నేర్చుకోలేదనీ నిలవదీసి పరీక్షించి అడిగేవారుండరు గనుకనూ, నెలనెలకూ జీతపురాళ్లు రావడానికి ఏదో ఇంత టపటపమనిపించి కాలక్షేపం చేస్తేగాని వీలుండదుగనుకనూ, కొంతమంది అధ్యాపకులు, పని అయిందనిపించడానికి కాలేజీకి వచ్చివెళ్తూఉంటారు. వాళ్లను కొంచెం బుద్ధిమంతుడైన కుఱ్ఱవాడేదైనా అడ్డుప్రశ్నవేస్తే తగిన సమాధానం చెప్పడానికి వాళ్లకు తోచదు. పైగా చిరాకు. అడిగినవాడిమీద గొంతువరకూ కోపం.

నేను వాళ్లడిగిన ప్రశ్నలకు సరిగా సమాధానం చెప్పడమేకాక, నాకున్నవీ, ఇతరవిద్యార్థులకు తట్టనివీ అయిన సందేహాలు అప్పుడప్పుడు అడుగుతూ ఉండడంచేత, విద్యార్థులకే గాక, అధ్యాపకులకు కూడా నేనంటే ఒకవిధమైన రుచియేర్పడింది. కాలేజీలో అర్థంగాని సందేహాలు కొందఱు నాస్నేహితులు వచ్చి నన్నడిగి తెలుసుకుంటూఉండేవారు.

మాక్లాసే చదువుతూ, అందఱు లెక్చరర్ల మన్ననలకూ పాత్రమైనది సుధాచంద్రిక అనే అమ్మాయి కూడాను. ఆమె కెంబెదవులపైన దరహాసచంద్రికలూ, ఆమెసుధారూపమూ సార్థకపఱుస్తూఉంటవి ఆమె నామాక్షరాలను. "తుమ్మెదఱెక్కల దొంగిలించును కాంతు" లనుట కవిసమయమే కాని ఆమె దీర్ఘమైన నీలపుజడ వెన్నుమీద జీరాడుతూఉండడం చూచిన ప్రతివ్యక్తికీ ఆశో, నిరాశో, పిచ్చిదో, వెఱ్ఱిదో, ఏదో ఒక తియ్యనితలపు మనస్సులో చొరబడక మానదను కుంటాను. ఏమంటే వెనుకనుండి చూచిన కొంచెం పొడుగుజడగల దుకూలధారిణియను ప్రతివ్యక్తి కొంచెం బాగుంటారంటాను. సదరు దుకూలధారిణుల ఎదుటి రూపం, వెనుకటిదానితో ప్రతివ్యక్తియెడలా అనురూపంగా ఉండదనికూడా అంటాను. కాని చంద్రిక సౌందర్యపిపాసువుల నేత్రతృష్ణ ననంతముగా చేయగలిగిన సర్వాంగలావణ్యవతి. కొందఱు ఒకసారిచూచి తిరిగిచూస్తేగాని తీరదనిపిస్తారు. కొందఱు ఒకసారి చూడడానికైనా ఎందుకనిపిస్తారు. కాని మాచంద్రిక ఒకసారిగాదు, వేసార్లు నిలబడిచూచినా తనివితీరని సోయగం గలదంటాను. మంచిరూపరేఖ గలవారికి మందబుద్ధి నైజగుణము. కాని మాచంద్రిక ఎంతసురూపము కలదో అంతకుశాగ్రబుద్ధి. ఆమె మంచిని ప్రేమిస్తుందనీ, సౌజన్యానికి దూరంకాదనీ, భద్రమతులను గౌరవిస్తుందనీ,— ఆమె చుట్టూఉండే గాలిబాలికలు చెప్పుకుంటూ ఉండేవారు. కాని ఆమెలో కొంచెం కలగలుపుగావచ్చిన గుణం చిలిపితనం. అది స్త్రైణసహజమేమో అనుకుంటాను. కొంచెంతూలుపాటుగల లెక్చరర్లను, అడ్డుప్రశ్న వేసి, బోల్తా కొట్టించడమంటే ఆమెకు సరదా! నాకూ క్రొత్తలో యీసరదా మిక్కుటంగా ఉండేది. అందుకని ఎప్పుడైనా వృద్ధాధ్యాపకులను తికమకబెట్టినప్పుడు నేను మనసులో ఆమెచమత్కృతికి మెచ్చుకుంటూ ఉండేవాడను.

ఒకనాడు—

"ఆల్ ఇండియా డిబేటింగ్ కాంపిటిషన్స్" కు మాకాలేజినుండికూడా విద్యార్థులను పంపుదా మనుకొన్నారు. ఆపోటీలలో పాల్గొనదలుచుకొన్న మా కాలేజీలో విద్యార్థులెవరేనా ఉంటే వాళ్లనందఱినీ వారిపేర్లివ్వమన్నారు. దాదాపు పదిమంది పేర్లిచ్చారు. నాస్నేహితులు కొందఱు తమపేళ్లతోబాటు నాపేరు కూడా కలిపిఇచ్చామని నాతో చెప్పారు. ఎందుకీశిక్ష, లనుకుని నాపేరిచ్చినందుకు నామిత్రులపైన విసుక్కున్నాను. పోటీలరోజు వచ్చింది. "స్త్రీస్వాతంత్ర్యము వాంఛనీయమా, కాదా" అనువిషయాన్ని చర్చనీయాంశంక్రింద ఇచ్చారు. నామిత్రు లందఱూ స్త్రీస్వాతంత్ర్యం వాంఛనీయమనే చెప్పారు. నేను కొంచెం చాదస్తులబిడ్డ నవడంచేత, స్త్రీస్వాతంత్ర్యమవాంఛనీయమని నాకుదోచినట్లూ, సభ్యులమదికెక్కునట్లూ ౧౫(?) నిముసాలు మాట్లాడి విరమించాను. అధ్యక్షుల సన్నిధికి స్త్రీసభ్యుల్లోనుంచి ఒకచీటివచ్చింది. ఇప్పుడు చెప్పబడిన ఉపన్యాసాన్ని ఖండిస్తూ తాను మాట్లాడడానికి సెలవొసంగవలెనని అభ్యర్థిస్తూన్నట్టు ఒకవ్యక్తి పంపుకొన్న చీటీ అది. దానిని చదివి అధ్యక్షు డందఱికీ వినిపించి పేర్ల పట్టికలో లేని క్రొత్తవారు మాట్లాడుట కనుమతి నిచ్చెదరా అని సభ్యులను అడిగిరి. సభ్యులు, తమ అనుమతి సూచించగా చీటిపంపినవారెవరో వచ్చి మాట్లాడవచ్చునని చెప్పి వారు ఆసీనులైనారు. స్త్రీసభామధ్యంనుండి అందఱికీ విస్మయం కలిగేటట్లు చంద్రికే లేచి వచ్చింది. నేను చెప్పిన ప్రతివిషయాన్ని ఖండింపప్రయత్నిస్తూ, సభ్యులందఱినీ విశ్వసింపజేసే వాగ్ధాటితో ఆమె ఒకఅరగంటసేపు మాట్లాడింది. చెప్పినదానిలో సమర్థింపదగిన అంశములున్నా లేకపోయినా మాట్లాడింది చంద్రికఅవడం

చేత అందఱూ సంతోషించారు. తుదకు అధ్యక్షులు న్యాయకుల అభిప్రాయం యీవిధంగా ఉన్నదని వెల్లడించారు:

"ఈరోజున మాటలాడినవా రందఱును, తమ తమ వైదుష్యమును వంచనలేకయే వెల్లడించిరి. ఒకరిని మించినవా రొకరువలె కన్పట్టుచున్నారేకాని సమర్థతాసమర్థతలు వివేచించుటకు ఒక్కరును తావొసగకున్నారు. కాని ఇరువురను తప్ప ఎంచిచూపుటకు మాకవకాశము లేనందున చివర మాట్లాడిన ఇరువురను అర్హులుగా నిర్ణయించుచున్నాను"

మఱునాడే నన్నూ, చంద్రికనూ ఢిల్లీకి అఖిల భారత పరీక్షలకు పంపిరి. వెళ్లినది క్రొత్తప్రదేశమగుటచేతనూ, ఒకేబండిలో కలిసి ప్రయాణంచేయుటవలననూ, ఒకే కాలేజీతరఫున వచ్చినవారమగుటచేతనూ, రాబోవు పరీక్షలనుగుఱించి మాటాడుటకై కొంత మాకు ప్రసంగింపక తప్పిందికాదు.

"ఏమండీ, చాలావిచిత్రంగా జరిగింది యీ సంఘటనం. ఏదో మీమాటలను ఎదుర్కోవడమున్నూ, నేనిల్లా ఇందులో చిక్కుపడడమున్నూ తటస్థించింది. ఢిల్లీకి వెళ్లాలిసివస్తుందని కల్లోనైనా అనుకోలేదు సుమండీ" అన్నది చంద్రిక.

నేను ఆమెతో ఎదురుబడి మాట్లాడడానికి కొంచెం సంకోచించీ పలకకపోతే బాగుండదనుకున్నాను.

"నేనున్నూ అనుకోలేదండీ! నే నీవిషయంలో అసలు జోక్యమే పెట్టుకోదలచుకోలేదు. ప్రసాదరావూ వాళ్లూ కలిసి నాపేరుకూడా ఇచ్చారట. వేదిక ఎక్కేవరకూ నాపేరు ఉపన్యాసక పట్టికలో ఉన్నదనే ఎఱుగను" అన్నాను.

"ఇంతమంది హేమాహేమీలుండగా ఎందుకని తొలిగి ఊరుకొన్న మనమీదే పడింది యీ ప్రయాస. ఇదంతా లేనిపోని భేషజం సుమండీ! మనసులో ఒక మాట ఉంచుకొన్నా పాయింటు కోసం మనం వేఱుగా మాట్లాడవలసిఉంటుంది. హృదయంలో బయలుదేరని భావాలను, ఎంతవాగ్ధాటిగలవాడికైనా, ఎదుటివారికి కల్లబొల్లిమాటలు చెప్పి నమ్మించడం దుస్సాధ్యం! ఏమంటారు?" అన్నది. ప్రత్యుత్తరం అభ్యర్థించిన దానిలాగా చూస్తూ ఊరుకుంది.

"మీరు దేన్నిగుఱించి మాట్లాడుతున్నారో నాకు తెలియటంలేదు. కొంచెం వివరించి చెప్పితే తెలుసుకోడానికి ప్రయత్నిస్తాను." అన్నాను వినయంగా.

"నా చేత చెప్పించడానికి అలా అన్నారుకాని మీకు తెలీకనా? అయినా ఒక్కసంగతి అడుగుతాను చెప్పండి. నిన్ననూ "నస్త్రీస్వాతంత్ర్యమర్హతి" అని అంతగట్టిగా మీరు వాదించినారుకదా! హృదయమునుండి ఊడిపడిన మాటలో, నాలుకతుదినుండి తెగిపడిన మాటలో కొంచెం సూక్ష్మదర్శికి ఎవరికేనా తెలీకపోదు. స్త్రీహృదయమని మీరు తూష్ణీంభావంతో చూచినా సరేగాని, నా అంతరంగంమాత్రం మీ రవి హృదయపూర్వకంగా అన్నమాటలని ఒప్పుకోవడంలేదు. అటుగాక "నీఅభిప్రాయం తప్పు. నే నవి మనఃపూర్వకంగా అన్నమాటలే" అని మీరు గట్టిగా చెప్పిన, మీయంతటి స్త్రీవిరోధిని ఎక్కడా చూడలేదని నేను తలచవలసివస్తుంది" అన్నది సుధ పరీక్షగా.

"మీచేత అలాగ తలచబడుట కెంతేని విచారిస్తున్నాను. స్త్రీలయెడ నాకెంతయూ గౌరవభావం కలదు. కాని స్త్రీలకు కావలసిన, ఉండవలసిన స్వాతంత్ర్యం వేఱు. లోకం కావలెనని ఘోషిస్తున్న విధం వేఱు. సాధారణంగా స్త్రీస్వాతంత్ర్యాన్ని గుఱించి మాట్లాడేటప్పుడు అందఱు ఒక్కవిషయాన్ని గుఱించి మఱిచిపోతారు. స్వాతంత్ర్యమువలన లాభములు, లేకపోతే నష్టములు, దానివిలువ, స్త్రీవ్యక్తిఘనత, స్త్రీలయెడ చూపవలసిన గౌరవమూ, పురుషుని బాధ్యత, ఇటువంటి అనవసరపు విషయాలమీద గొంతుచించుకొని, బల్లలు పగలగొట్టి, చివరకు "ఎటువంటి స్వాతంత్ర్యము స్త్రీకి ఉండతగినది." అనే విషయం విస్మరిస్తారు. గొంతుక బొంగురుపోవడంచేతనూ, అక్కడక్కడ

సభ్యులు ఉలికిపడి, ఎగిరిపడి, భయపడడంచేతనూ, అధ్యక్షుడికుర్చీ, ముందటిబల్లా రెండుమూడుసార్లు గజగజలాడడంచేతనూ వాడిని మహోపన్యాసకుడంటారు. ఈవిషయాన్నిగురించే నేనునొక్కి చెప్పినాను. ఎటువంటి స్వాతంత్ర్యం స్త్రీకి ఉండతగినదో, దానినిగురించి నా వెల్లడించిన ఊహలు మీమనస్సునకు వ్యతిరిక్తములుగా దోచినచో, మీమనస్సు నొప్పించినందుకు చింతించుచున్నానని తెలుపుచూ, నాయభిప్రాయములే ప్రశస్తములని వక్కాణించుటకునూ, మీరుకూడ వాని నామోదించిన భాగుండునేమో యని సూచించుటకునూ సాహసించుచున్నాను."

"మోహన్, అయితే ఒక్కమాట, స్త్రీ జీవితంలో మనం ముఖ్యంగా ఆలోచించవలసిన సమస్య వివాహం. దానితోనే ఆమెజన్మ ధన్యమౌతుంది. దానితోనే పరమేష్ఠియొక్క అనంతసృష్టిలోతానుకూడ భాగధేయ మయ్యే అర్హత ఆమెకు కలుగుతుంది. ఆ పరిణయకార్యమే ఆమెకు గౌరవం చేకూరుస్తుంది. లేకపోతే అది ఎప్పుడు 'అనాఘ్రాతపుష్పం' వలెనే ఉండి, నిష్ఫలమైన జీవితాన్ని వెళ్లబోసి చివరకి ఎండి తొడిమ ఊడి నేలపాలు గావలసినదే. అట్టి మహావిషయంలో, స్త్రీకిసంబంధించిన విషయంలోనే ఆమెకు స్వేచ్ఛ ఇవ్వకపోతే ఇంకా మీరు ఏవిధమైన స్వేచ్ఛ ఇస్తే ఆమె జన్మ తరిస్తుంది. నిన్నటిఉపన్యాసంలో అట్టిది కూడదనికదా మీరు చెప్పినారు." అన్నది సుధ చురుగ్గా.

"సుధా! అసలు తక్కువఆడంబర మెక్కువ అయిన ఆధునికులఉపన్యాసధోరణి నీకుకూడా బాగా అలవడ్డది. స్త్రీకి వివాహవిషయంలో స్వేచ్ఛఉండవలెననే మాట తేల్చడానికి వివాహాన్నిగురించిన ఆమైలున్నర ఉపన్యాసమెందుకు? నీవడిగినమాటకు సమాధానమప్పుడే చెప్పియున్నాను. అప్పు డర్థంకాకపోతే తిరిగీ చెప్పడానికేమీ అభ్యంతరం లేదు, విను. అసలు భౌతిక సృష్టి అంతటిలోనూ బుద్ధిబలములోనైతేనేమి, కార్యోత్సాహంలోనైతేనేమి, విజ్ఞాననివేచనలోనైతేనేమి, జీవితరహస్యాలు విచారించడంలోనైతేనేమి, స్త్రీప్రకృతికన్న పురుషప్రకృతి పైస్థాన మాక్రమిస్తుందని అందరూ ఒప్పుకున్న సంగతి. అలాగన్నానని స్త్రీలలో మాత్రం కార్యశూరులు, మనీషిణులు, కవయిత్రులు లేరని చెప్పను. ధీబలము, కర్మవీరత్వము అన్నీ పురుషుల సొమ్మే అయితే స్త్రీలోకంలో వీళ్లెలా కలిగేరంటే ఒకటేసమాధానమిస్తాను. భూమిమీద పొడమిన ప్రతివ్యక్తికీ స్త్రీత్వము, పుంస్త్వము, రెండునూ ఉంటవని నేనంటాను. పురుషుడని తెలియబడ్డవానిలో కూడ స్త్రీత్వమున్నదనీ, స్త్రీయని తెలియబడ్డదానిలో కూడ పుంస్త్వమున్నదనీ నాభావము. అలాకాకపోతే స్త్రీపురుషులకు సంబంధమే ఉండదని నాతలపు. కాని స్త్రీత్వము పురుషునిలో ఎంతఎక్కువయితే అంతగా వాడిపౌరుషము నశిస్తుంది కనుక అంతగా కర్మశూరత్వము, తెలివితేటలూ, అన్నీ వానిలో క్షీణిస్తవి. అలాగే స్త్రీలోకూడ పుంస్త్వ మెంతఎక్కువయితే అంత స్త్రీసహజమైన దౌర్బల్యలౌల్యచాంచల్యాలు నశిస్తవి. కనుక, పౌరుషవతులైన ఝాన్సీలు, మీరాలు, మొల్లలు మొదలైనవా రుద్భవించారు.

స్త్రీ వివాహవిషయం ఆమెకే వదలివేయడం అసమంజసమూ, హానికరమూను. పండ్రెండేండ్లకు ఆమె లోకజ్ఞానంమాటే సమార్జించియుండదు. కేవలం వయోవిలాసోద్రిక్తభావాలతో పొర్లుతూఉన్న మనస్సు కలిగిఉంటుంది అలాంటప్పుడు ఆమెమనస్సుకు యుక్తాయుక్తవివేచన ఉండదు. ఆమెమనస్సెప్పుడూ మిళిందాగమనం నిరీక్షిస్తున్న ప్రఫుల్లప్రసవంలాగ వయఃతృష్ణతో, సుఖసమాసక్తి కాంక్షిస్తూ ఉంటుంది. అటువంటిసమయంలో ఆమెమనస్సు బహిరాడంబరములచే మోసగింపబడుటకు ఎంతైనా అవకాశం ఉంటుంది. కనుక కావలసినంత లోకజ్ఞాన మదివరకే తమతమ జీవితపుటోలములలో సంగ్రహించుకొని, ప్రపంచకములోని బాగోగులు చక్కగా గుర్తెఱిగిన తలిదండ్రులే ఆ విషయాన్ని బాగా ఆలోచించేస్థితిలో ఉంటారు. ఒకవేళ తండ్రి ధనతృష్ణకలిగి కారానిపని చేయమూనినను, ఆమెను పుట్టించిన స్త్రీప్రకృతికి ప్రతినిధియైన తల్లి

అట్లు చేయనీయదు. కనుక యౌవనోద్రిక్తభావములకగ్గముగు మనస్సున కంటికింపుగా కనబడిన ఎవరో బయటి బటారపుబయకారిపాల్లై ఆమె బాములుపడుటకంటె, యుక్తాయుక్తవిచక్షణ కలిగిన తలిదండ్రు లెన్ని చేసిన మగవానితోడనే ఆమె సుఖపడగలదని నావిశ్వాసము. అందువలన వివాహవిషయమైన స్వేచ్ఛ ఆడుదాని కీయదగదని చెప్పితిని" అన్నాను.

* * *

"పైపైమాట లెన్ని చెప్పినా, మోహన్, ప్రధాన విషయందగ్గఱ కొచ్చేసరికి అందఱూ పట్టీలుకొట్టారు. మీ రిన్నిమాటలు చెప్పినారుకదా, నేనొక్కటే విషయమడుగుతాను, జంకక కొంకక సమాధాన మివ్వండి. ఇప్పుడు నేనే ఉన్నాను. నాబాగోగులను గుఱించి, నాభవిష్యత్తును గుఱించిన సాధకబాధకాలను గుఱించి నేను పూర్ణముగా ఎఱిగిఉన్నాను. నామనస్సులో ఒక ప్రేమమూర్తిని నెలకొలుపుకొని ఉన్నాను. అతన్ని బలవంతంగా ఊడబెఱికి పాఱవేద్దామన్నా నాకు సాధ్యం కాదు. ఇంకొకనిపైకి నామనస్సుపోదు. అతన్ని చూడని నిముషం నాకు జీవితంలో హాలాహలబిందువై విషాగ్నులను రగులుస్తుంది. అతని వదనజ్యోతిచూడక నాజీవితం గాఢాంధకారబంధురమై పోతుంది. నేను కాళరాత్రికన్నా, ధ్వాంతరేఖకన్నా, ఘూకరవంకన్నా ఉదాసీన వ్యక్తినౌతాను. అలాంటి నాహృదయనిక్షేపాన్ని, నాప్రణయమూర్తిని కాదని, క్రూరంగా మా తలిదండ్రు లెవరినో నాకంటగడతా రనుకోండి. ఎందుకొఱకై యీనాస్త్రీజీవిత మద్దేశింపబడిందో ఆభగవదాశయం నెఱవేఱుతుందంటారా?"

అని రెండుచేతుల్లో తన ప్రేమమయవదనాన్ని నిక్షేపించుకొని నావంక నిలువునా చూస్తూ ఊరుకుంది సుధ. నాకామెనేత్రాలల్లో నుండి ఆమెహృదయమునందేమో విచిత్ర భావాలు తరంగితమౌతున్నట్లూ, అవి నా ఆమోదాన్ని అభ్యర్థిస్తున్నట్లూ, నేను కాదన్న పక్షాన ఆమెహృదయంలో ఒకఝంఝామారుతం రేగునన్నట్లూ స్ఫుటమైన వ్రాతలు కనపడ్డవి.

నాకు నిజంగా వాగ్బంధనమైంది. సాధారణంగా మాట్లాడినంతసేపూ స్త్రీపురుషబాంధవ్యాన్ని గుఱించిన సంభాషణ ఒకస్త్రీతో ఒకపురుషుడు చేయతగి ఉంటుంది కాని ఎప్పుడు చర్చ వ్యక్తినిర్దిష్టమౌతుందో అప్పుడు కొంచెం అజాగ్రత్తగా తూలిపడిన ప్రతిముక్కా విపరీతావస్థలు తెస్తుంది. అందుకని నేను ఆవిషయం సాధ్యమైనంత త్వరలో ముగింపదలచి "ఔను" అన్నాను.

తరువాత చెప్పదగిన మాటామంతులుకానీ, వింతలుకానీ లేకనే ఢిల్లీ చేరినాము. పరీక్షల్లో చాలామంది పాల్గొన్నారు. కాని భగవదనుగ్రహమునా, అదృష్టవశమునా మాకాలేజీమర్యాద నిలుపగలిగినాం. మేమే విజయులమైనాం. వెంటనే ప్రిన్సిపాలుగారికి మేము గెలిచినట్లూ, మర్నాడు బయల్దేరి వస్తున్నట్లూ టెలిగ్రామిచ్చాము. ఉత్తరదేశాల్లో ఆంధ్రులంటే కొంచెం గౌరవిస్తారు. మేము మాట్లాడినతీరు వాళ్లకు నచ్చినట్లుంది. అందువలన మమ్మేదో పెద్దగా గొప్పజేసి బ్యాండులతోనూ, విజయధ్వనులతోనూ ఊరేగించినారు. ఊరేగింపులో నేనూ సుధా ఒకకారులోనే, ఒకసీటులోనే కూర్చోవలసివచ్చింది. నిజానికి మనసువిడిచి చెబుతున్నాను; ఏమన్నా అనుకోండి, మీరు తర్వాత. సుధను ఆనుకొని ఆమెప్రక్కనే కూర్చునేసరికి ఒడలు గగుర్పొడిచింది. ఆమెసంగతి నేను చెప్పలేను. ఊరేగింపు ఐనదాక నాకు మనసులో మనసు లేదు. సుధా హృదయంలో ఏవిధంగా నారూపం చిత్రింపబడుతున్నదో అని అంతరంగం ఊరికే ఉబలాటపడుతూ ఉంది. ఊరేగింపు అయినది. సాయంకాలమైనది. మఱునాటి ప్రొద్దుటివరకు బండిలేదు. అందువలన ఒకసత్రంలోనికి పోయి ఒకగదిలో మాసామానులన్నీ పడవేయించుకొని ఆరాత్రి అక్కడ గడపడానికి నిశ్చయించుకొన్నాం.

నాహృదయస్థితి నాకే అగమ్యగోచరంగా ఉంది. ఇంతకన్నా విప్పిచెప్పే సమర్థత నాకులేదు. ఏలనంటే తన్నుగానీ, తానుగానీ ఎఱుగని పరాయిచోట పరయువతితో, ఒక్కగదిలో దైవ మట్లు నన్ను తారసిల్లచేసిన విచిత్రానికే నామనసు చాలా నిర్ఘాంతపోయింది.

హోటలునుంచి తిరిగిరాగానే ఇరువురమూ ఎడమెడముగా ప్రక్కలు పఱచుకొన్నాము. ప్రొద్దున కారులో సుధామయమైన సుధాశరీరస్పర్శమైనకడనుంచి నాకు పిచ్చియెత్తినట్లున్నది. ఆమె మొగమును కన్నెత్తి చూచి ఇదివరకువలె స్వేచ్ఛగా సంభాషించుటకైన నాకు ధైర్యం చాలటంలేదు. ఏదోతప్పుచేసినదానివలె ఊరికే అంతరంగం కొట్టుకుంటూంది. అందుకని ఆమెతో ఆగదిలో ఆరాత్రి ఒంటరిగా ఉంటే నా మనస్సు బాధపడుతుందనుకొని ఏలాగైన మనస్సుకు వేఱొకవ్యావృత్తి కల్పిద్దామనుకొని

"సుధా! నేను సినీమాకు వెళ్తున్నాను" అన్నాను.

సుధ తన నవ్వుమొగమును అట్టె పైకెత్తి వాడిగా చూస్తూ,

"నన్నొంటరిగా విడిచేనా? మోహన్! ఇదే మీజాతిలోనూ, మాజాతిలోనూ ఉన్న తారతమ్యం. అనురాగాంకురాలలముకొన్న వంటే స్త్రీ హృదయం తనప్రేమను గెలిచినవాడికి తనసౌఖ్యం, తనజీవితం, తనసర్వస్వమూ ధారవోయడానికి వెనుకాడదు. అతనికి సుఖం సమకూర్చడానికి ఆత్మార్పణం చేయడానికైనా ఏమీ జంకదు. కాని మగజాతి కానీతి లేదు. కండ్లముందరఉన్నంతసేపే ఏసరదాఐనా పశుతుందిపురుషహృదయం. చూపుదాటినతరువాత దానిదారి అదీ, దీనిదారి ఇది."

అని కొంచెంసేపు ఊరుకుంది ఎగాదిగా నావంక చూస్తూ సుధ. ఆమెకన్నుల్లో నీలినీడలు నాహృదయం మీదికి ప్రాకుకుంటూ వచ్చాయి. నేను సినీమాకు వెళ్లే ప్రయత్నం విరమించుకొని నాప్రక్కమీద కూలపడ్డాను. మాయిద్దరి నడుమ లాంతరు పెద్దగా వెలుగుతూఉంది. కిటికీలోనుండి చల్లని పిల్లగాలులు లోపలికి పారాడుతున్నాయి. ఆకాశంలోనుంచి కోమల మరీచికలను కిటికీనుండి జాబిల్లిబుడుత పారబోస్తున్నాడు. పాలసముద్రంలో తేల్తున్న ఎఱ్ఱతామరపువ్వులాగ, తెల్లని దుప్పటి పఱచిన పఱుపుమీద గులాబీరంగుసిల్కుచీర ధరించి సుధాచంద్రిక పరున్నది. జాబిల్లికిరణాలు ఆమె పైడిబుగ్గలిసుంటల్లో పడి పొర్లిగింతలు పెడుతూ, కాంతులతో వాటిని నిండిస్తున్నాయి. ఆమెఉన్నతవక్షం లాలనను ఆశిస్తున్నది. ఆమెసురూపానికి చిలుకప్రక్క గోర్వంకలాగా ఇంకోటి ఏదైనా ఉంటే బాగుంటుందనిపించింది నాకు.

*   *   *   *   *

పనికట్టుకుని మళ్లీ ఇంతదూరం డబ్బుఖర్చుపెట్టుకుని ఎలాగూ రాముగనుక వెళ్లేటప్పుడే బొంబాయిమీదుగా వెళ్లి ఆమహానగరంకూడా చూచిపోదామనుకున్నాము. సుధప్రసన్నవదనం చూస్తూనే బొంబాయి చేరినాము. ఆనగరములోని వింతలు, విశేషాలూ ఇద్దఱం కలిసి చూచి ఆనందించాము. బొంబాయిలోఉన్న సాయంకాలం సముద్రతీరానికి షికారుకు వెళ్లేము. అక్కడ ఇసుకతిన్నెలమీద నడుస్తూ సుధ తన ముద్దుపాదాలతో ఇసుకరేణువుల్ని ఎగరదంతూ విలాసంగా మబ్బుతునకలాగ నడుస్తూవుంటే, ఆమెచేయి పట్టుకొని నేనూ, నాచేయి పట్టుకొని సుధా పరస్పరం హాయిగా పల్టీలుకొడుతూ ఉన్న జలపక్షుల్ని చూస్తూ విహరిస్తున్నాము. చిన్నచిన్న డింగీలు తీరాన్నే కెరటాలమీద కేకిసలుకొడుతూ ఉన్నాయి.

ఒక్కసారి అలాషికారుగా సముద్రంమీద తిరిగివద్దామంది సుధ. నాకున్నూ బోటుషికారంటే రసదాయే. బోటు నడపటం పట్నంలో ఉండగా అప్పుడప్పుడభ్యసిస్తూ ఉండేవాణ్ణి. సరేనని ఒకచిన్నడింగీని నీటిలోపలికి తోసి ఇద్దఱమూ ఎక్కాం. శుక్లపక్షపు చంద్రుడు ఆకాశమెక్కి చూస్తున్నాడు. సముద్రపు నీటిమీదినుండి చల్లని తుంపురలతో గూడిన పైరగాలి వస్తూఉంది. కెరటాలు సాగరగర్భంలోనుండి బయలుదేరి పడవను తూగుటుయ్యాలమాదిరిగా ఊగిస్తూ సరిగా ఊగకపోతే దాన్ని చిన్నచిన్న చపేటాలుకూడా కొడుతూఉన్నాయి. పడవ రంయిమని వడికి బడి కొట్టుకొనిపోతూఉంది. చుక్కాని గట్టిగా పట్టుకొని కూర్చున్నాను. ఎదురుగా బల్లమీద సుధ నావంకా, చంద్రుడి

వంకా, కెరటాలవంకా చూస్తూ కూర్చుని నన్నొకపాట పాడమన్నది. నేను

"ఆపలేనేయెంకి ఈపడవయిసురూ,
పాడలేనే యెంకి ఈగాలిరొదలో"

అని యెత్తుకున్నాను. సుధ సావధానంగా విని నెమ్మదిగా లేచింది. చేతులెత్తి వళ్లువిరుచుకొని వచ్చి నా ప్రక్కనే కూర్చున్నది. నేను జరిగి ఆమెకు చోటిచ్చాను.

"మోహన్! చాలా చలిగావున్నదోయ్; అబ్బా" అని మళ్లీ సుధ వళ్లు విరుచుకొన్నది. ఆమె ఉన్నతవక్షం, ఆమె ముద్దుమొగం, ఆమె ఒయ్యారం నామతిపోగొట్టింది. ఆమెకండ్లవంక చూచాను. ఆచూపుల్లో చెప్పరాని ఆవేగం, మీదపడదామన్నంత ఉద్రేకం నాకు గోచరించింది. నన్ను నేను మరచిపోయినాను. అంతలో వేగంతో పోతూఉన్న పడవ అంచుమీదినుండి ఆమె సముద్రపునీళ్లను అందుకొనటానికేమో అన్నట్లు వంగింది. మఱునిముసంలో హఠాత్తుగా "మోహన్! అయ్యో" అని వినిపించింది. చుక్కాని విడిచి ఒక్కగంతువేసి ఆ ప్రేమమూర్తిని చేతుల్లో పట్టుకొన్నాను. భయపడిందికాబోలు సుధ, కాస్సేపుసొమ్మసిల్లి నాతొడమీద పడుకుంది. ఆమెముఖంవంకి నే తేరిపార ఆసతో చూస్తూ నిగ్గుటద్దాలవంటి ఆమెచెక్కులు దువ్వుతూ కొంచెం దగ్గఱకు చేర్చేసరికి ఆమెకు తెలివివచ్చింది. చప్పున లేచి "మోహన్, మీ ఉపకారానికి కృతజ్ఞను. పడిపోవాల్సిందే సుమా. మీవల్ల బ్రతికాను. చాలా ప్రొద్దయింది. పడవత్రిప్పండి" అంది. పడసంగతేమఱచిపోయినాను నేను. చూస్తినిగదా, మహాప్రమాదావస్థలో పడ్డాము. మాగొడవలో చుక్కాని పట్టు తప్పి పడవ సముద్రపుప్రవాహపు టురవడిలో బడి ఎక్కడకో కొట్టుకొనిపోతున్నది. ఎటుచూచినా చేరెడునేలైనా కనపడదు. గొంతుచించుకొని అఱచినా మాఱ్మ్రోతకూడా పుట్టని నీటిబయలు. ఎంతగా ప్రయత్నించినా చుక్కాని నిలవడంలేదు; గాలిరేగింది. తరంగాలు దొంగడలైనవి, ఏమూలనుంచో ఒకచిన్నమేఘం బయలుదేరి జాబిల్లినీ, ఆకాశాన్నీ మింగేసింది. అంతా అంధకారం. అంతకంతకు భోరుమంటూ కెరటాలు చెలరేగి మాచిన్నపడవను తలక్రిందులు చేస్తున్నాయి. ఒక్కొక్క కెరటం విఱిగి పడవలోకి గూడా వచ్చిపడుతూన్నది. సుధకు బయటి తుపానుకంటె వేయిరెట్లుగా మనసులో తుపాను రేగిందికాబోలు. ఒక్కసారి హఠాత్తుగా

"మోహన్"

అని వచ్చి గట్టిగా నన్ను కౌగిలించుకొన్నది. తుపాను అంతకంతకు ఎక్కువైంది. మేము జీవితాలమీద ఆశవదలుకొన్నాం, ఒకరినొకరు గట్టిగా కౌగిలించుకున్నాం. విఱిగి మామీదపడి కూడా కెరటాలు మాయిద్దఱిదేహాలు ఒత్తుకుని ఉన్న భాగాన్నిమాత్రం తడపలేకపోతున్నాయి. చివరకు హోరుమని ఒకే పెద్దశబ్దతో ఒకగాలి తాకు, భోరుమని ఒకపెద్దకెరటపు పెల్లవిఱుపు.

"సుధా" "మోహన్" "సుధా" "మోహన్" "సుధా"

*　　*　　*　　*　　*

"సుధా" అని గట్టిగా అరుస్తూ లేచి కూర్చున్నాను. నాకేకకు ఉలికిపడి సుధకూడా లేచి కూర్చుంది.

"సుధా" చాలా విచిత్రమైన కలవచ్చింది. నేను పట్నం వెళ్లినట్లు, నీవు ఇంకా ఇక్కడే ఉన్నట్లూ, మీ వాళ్లు నిన్నుగుఱించి నన్నడిగినట్లూ, నేను వాళ్లతో "మీసుధ విమానంమీద వస్తుందని చెప్పినట్లూ వాళ్లు నమ్మనట్లూ, అయితే "ఇదుగో; పిలుస్తా చూడం"డని, నేను గట్టిగానిన్ను పిలిచినట్లూ—ఇదీ విషయం—సైమెంతైంది."

సుధ రిస్టువాచి చూచింది. బండి కింకా గంటే టైముంది. లేచి త్వరగా కాల్యాలు తీర్చుకొని కాఫీ త్రాగి ఢిల్లీస్టేషను చేరుకున్నాము. (సశేషము)